జనంవాయిస్ తెలుగు దినపత్రిక
నిజం మా మాట | న్యాయం మా ధ్యేయం | ప్రజల కోసం మా ప్రయాణం

# కేజీబీవీ ఉద్యోగులపై కక్షసాధింపు చర్యలా?

- అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని వదిలి చిరుద్యోగులపై పతాపమా..?
- టర్మినేషన్లు నిలిపివేయాలి : ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు భీమా నాయక్.

**కురవి, సెప్టెంబర్ 29 (జనం వాయిస్) :**

మహబూబాబాద్ జిల్లాలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల్లో (కేజీబీవీ) ప్రక్షాళన పేరుతో ఉద్యోగులపై కక్షసాధింపు చర్యలు జరుగుతున్నాయని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గూగులోతు భీమా నాయక్ ఆరోపించారు. నూతనంగా జీసీఈఓ బాధ్యతలు చేపట్టిన అనంతరం స్పెషల్ ఆఫీసర్లపై వరుసగా చర్యలు తీసుకోవడం పట్ల ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ విద్యా సంవత్సరంలో గార్ల మండల కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్‌ను టర్మినేట్ చేయడంతో పాటు తాజాగా కురవి మండలం నేరడ కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్‌పై కూడా టర్మినేషన్ చర్యలు తీసుకున్నారని తెలిపారు. డోర్నకల్ కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్‌కు షోకాజ్ నోటీసు జారీ చేయడం కూడా ఇదే క్రమంలో భాగమని విమర్శించారు.



### పూర్తి విచారణ లేకుండా టర్మినేషన్ ఎలా?

ఎన్నో సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులపై ఆరోపణలు వస్తే ముందుగా సమగ్ర విచారణ జరిపి, వాస్తవాలను నిర్ధారించిన తర్వాతే చర్యలు తీసుకోవాలని భీమా నాయక్ డిమాండ్ చేశారు. అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోకుండా చిరుద్యోగులపై మాత్రమే కఠిన చర్యలు తీసుకోవడం సరికాదన్నారు.

### జీసీఈఓపై గత ఆరోపణలపై విచారణ జరపాలి

ప్రస్తుతం జీసీఈఓగా ఉన్న అధికారిపై గతంలో నేరడ కేజీబీవీలో బాధ్యతలు నిర్వహించిన సమయంలో నిధుల దుర్వినియోగం, విద్యార్థులకు కేటాయించిన సరుకుల వినియోగానికి సంబంధించి ఆరోపణలు వచ్చినట్లు భీమా నాయక్ పేర్కొన్నారు. అలాగే గతంలో పాఠశాల విధులకు సంబంధించి కూడా ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. ఈ ఆరోపణలన్నింటిపై సంబంధిత ఉన్నతాధికారులు వాస్తవాలను వెలికితీసేలా సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

### తనిఖీల తీరుపై అభ్యంతరం

కేజీబీవీల తనిఖీల సమయంలో అధికారితో పాటు ఆమె భర్త, ఇతర వ్యక్తులు రావడం, అనంతరం కొందరు స్పెషల్ ఆఫీసర్లకు ఫోన్ చేసి బెదిరింపులకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయని భీమా నాయక్ తెలిపారు. అయితే ఈ ఆరోపణలపై అధికారికంగా విచారణ జరిపి వాస్తవాలను తేల్చాలని కోరారు.

### నేరడ ఎస్‌ఓను వెంటనే విధుల్లోకి తీసుకోవాలి

నేరడ కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్‌పై తీసుకున్న టర్మినేషన్ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకుని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని భీమా నాయక్ డిమాండ్ చేశారు. కేజీబీవీల్లో పనిచేస్తున్న ఉద్యోగులపై కక్షసాధింపు చర్యలు ఆపాలని, ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రతి అంశంపై నిష్పక్షపాత విచారణ జరపాలని కోరారు. సమస్యను పరిష్కరించకపోతే ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

# పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

**మహబూబాబాద్, సెప్టెంబరు 29 (జనం వాయిస్):**

మహబూబాబాద్ జిల్లా ఎస్సీ కార్పొరేషన్ నూతన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ)ని వివిధ ప్రజా, కార్మిక, విద్యార్థి సంఘాల నాయకులు జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) దుడ్డేలా రామ్మూర్తి, తెలంగాణ గిరిజన సంఘం (టీజీఎస్) కిషన్ నాయక్, బహుజన స్టూడెంట్స్ యూనియన్ (బీఎస్‌యూ) మంద శశికుమార్ తదితరులు ఈడీని శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అమలయ్యే సంక్షేమ పథకాలు, రుణాలు అర్హులైన లబ్ధిదారులకు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి పథకాల అమలులో పారదర్శకత పాటించాలని, పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. సంఘాల నాయకుల విజ్ఞప్తులపై ఈడీ సానుకూలంగా స్పందిస్తూ, అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో చేపూరి గణేష్, వెంకన్న గణేష్ తదితరులు పాల్గొన్నారు.




# బోనస్ సీలింగ్ ఎత్తివేయాలి : యుగంధర్

**మహబూబాబాద్, సెప్టెంబర్ 29 (జనం వాయిస్) :**

రైల్వే కార్మికులకు అందించే ప్రొడక్టివిటీ లింక్డ్ బోనస్ (పిఎల్ బి)పై ఉన్న రూ. 7,000 గరిష్ట పరిమితిని ఎత్తివేసి, వాస్తవ వేతనాల ఆధారంగా బోనస్ చెల్లించాలని మజ్దూర్ యూనియన్ జోనల్ వర్కింగ్ కమిటీ సభ్యులు, ఎస్సిఆర్ఎంయు వరంగల్ బ్రాంచ్ సెక్రెటరీ ఆవుల యుగంధర్ యాదవ్ డిమాండ్ చేశారు. పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని మజ్దూర్ యూనియన్ పిలుపు మేరకు మహబూబాబాద్ పివే కార్యాలయం ఎదుట రైల్వే కార్మికులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా యుగంధర్ యాదవ్ మాట్లాడుతూ కార్మికులపై అదనపు పనిభారం తగ్గించి సురక్షితమైన పని వాతావరణం కల్పించాలని కోరారు. ట్రాక్ మెయింటెయినర్ల గస్తీ పరిధిని 12 కిలోమీటర్లకు పరిమితం చేయాలని, కీమ్యాన్లకు అప్పగిస్తున్న అదనపు విధులను ఉపసంహరించాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కొత్త ఆస్తులకు అనుగుణంగా కొత్త పోస్టులు మంజూరు చేయడంతో పాటు ఓటిఎ, టిఎ బకాయిలు, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, చిల్డ్రన్ ఎడ్యుకేషన్ అలవెన్స్‌ను వెంటనే చెల్లించాలని కోరారు. రాత్రి గస్తీకి ఇద్దరు పెట్రోల్‌మెన్లను నియమించాలని, అర్హులైన ఉద్యోగులకు జీడీసిఇ, ఎల్డిసిఇ, ఎవిసి అవకాశాలు కల్పించాలని, పెండింగ్ పరీక్షలను నిర్వహించాలని తెలిపారు. ఉద్యోగుల పదోన్నతుల కోసం సీబీటి పరీక్షలను క్రమం తప్పకుండా నిర్వహించాలని, రైల్వే ఆసుపత్రుల్లో సిబ్బందిని పెంచాలని డిమాండ్ చేశారు. ట్రాక్ మెయింటెయర్లు, లోకో పైలట్లకు యూనిఫాం కిట్లు, వాటర్ బాటిళు అందించాలని కోరారు. కార్మికుల న్యాయమైన సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించకపోతే మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో మరింత విస్తృత ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సెక్రెటరీ బాబురావు, ఇంజినీరింగ్ కో-ఆర్డినేటర్ సతీష్, యూత్ లీడర్లు కనకయ్య, గోపీలాల్, జైల్‌సింగ్, రాజు, రమేష్, సంతోష్, నరేందర్, రవి, వరుణ్, లత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.




# కేసముద్రంలో 2-బి బార్‌కు దరఖాస్తుల ఆహ్వానం

- రూ.30 లక్షల వార్షిక ఎక్సైజ్ పన్ను స్లాబ్
- అక్టోబర్ 12 వరకు దరఖాస్తులు.. 16న లాటరీ.

**మహబూబాబాద్, సెప్టెంబర్ 29 (జనం వాయిస్):**

కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలో ఒక 2-బి బార్ ఏర్పాటుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మధ్య నిషేధ, అబ్కారీ అధికారి పి.కరంచంద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం, అబ్కారీ శాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు ఈ నోటిఫికేషన్ జారీ చేసినట్లు పేర్కొన్నారు. కేసముద్రం మున్సిపాలిటీలో ఏర్పాటు చేయనున్న 2-బి బార్‌కు వార్షిక బార్ ఎక్సైజ్ పన్ను స్లాబ్ రూ. 30 లక్షలుగా నిర్ణయించినట్లు తెలిపారు. సెప్టెంబర్ 28 నుంచి అక్టోబర్ 12 సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులను స్వీకరిస్తామని పేర్కొన్నారు. బార్‌కు దరఖాస్తుదారుల ఎంపికను అక్టోబర్ 16న ఉదయం 11 గంటలకు మహబూబాబాద్ IDOC కాన్ఫరెన్స్ హాల్‌లో లాటరీ పద్ధతిలో నిర్వహించనున్నట్లు తెలిపారు. దరఖాస్తులను హైదరాబాద్‌లోని అబ్కారీ కమిషనర్ కార్యాలయం, వరంగల్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయం లేదా మహబూబాబాద్ జిల్లా అబ్కారీ అధికారి కార్యాలయంలో సమర్పించవచ్చని తెలిపారు. దరఖాస్తుతో పాటు రూ. 1 లక్షల నాన్‌రిఫండబుల్ రుసుము, మూడు పాస్‌పోర్ట్ సైజు కలర్ ఫోటోలు, ఆధార్, పాన్ కార్డు స్వీయ ధృవీకరించిన ప్రతులు సమర్పించాల్సి ఉంటుందని వివరించారు. పూర్తి నోటిఫికేషన్, మార్గదర్శకాలు, షెడ్యూల్‌ను టీజీబీసీఎల్ అధికారిక వెబ్‌సైట్లో పరిశీలించి, అర్హత ఉన్న ఆసక్తిగల దరఖాస్తుదారులు గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని అధికారి సూచించారు.



# కేజీబీవీల్లో టెర్మినేషన్ విధానాన్ని రద్దు చేయాలి

- టెర్మినేట్ చేసిన ఎస్‌ఓలను పునర్నియమించాలి : టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమేష్.

**కురవి, సెప్టెంబరు 29 (జనం వాయిస్):**

కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో (కేజీబీవీ) అమలు చేస్తున్న టెర్మినేషన్ విధానాన్ని రద్దు చేయాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టిపిటిఎఫ్) జిల్లా అధ్యక్షుడు బలాష్టి రమేష్ డిమాండ్ చేశారు. టిపిటిఎఫ్ కురవి మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని పలు పాఠశాలలను సందర్శించి సమస్యలను సేకరించడంతో పాటు సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ టెర్మినేట్ చేసిన కేజీబీవీ ఎస్‌ఓలను తిరిగి పునర్నియమించాలని కోరారు. కేజీబీవీల్లో చదువుతున్న విద్యార్థినుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పాఠశాలల నిర్వహణను మరింత పటిష్టం చేయాలన్నారు. కేజీబీవీల్లో పనిచేస్తున్న ఎస్‌ఓలతో జిల్లా కలెక్టర్ ప్రత్యేక సమావేశం నిర్వహించి పాఠశాలల పని విధానంపై సమగ్రంగా చర్చించి, నిర్వహణలో అవసరమైన ప్రక్షాళన చేపట్టాలని కోరారు. సిబ్బందికి సమాన పనికి సమాన వేతనం అమలు చేయడంతో పాటు కేజీబీవీల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయినులకు హెల్త్ కార్డులు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిపిటిఎఫ్ మండల అధ్యక్షుడు గుండ్ల విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ఓదెల శివకుమార్, జిల్లా బాధ్యులు బొల్లం శ్రీనివాస్, గుగులోత్ వెంకన్న, బాలరాజు, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# గ్రామాభివృద్ధికి ప్రణాళిక మ్యాప్

## మైలారం గ్రామానికి వికసిత్ గ్రామపంచాయతీ ప్లానింగ్

**జనం వాయిస్, శాయంపేట, సెప్టెంబరు 29:**

వికసిత్ గ్రామపంచాయతీ ప్లానింగ్ (విజిపిపి)లో భాగంగా మైలారం గ్రామానికి సంబంధించిన గ్రామకంఠం ప్లానింగ్ మ్యాప్‌ను మంగళవారం మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయ ఆవరణలో రూపొందించారు. గ్రామ సర్పంచ్ నూనె దివ్య--తిరుపతి ఆధ్వర్యంలో గ్రామంలోని రహదారులు, సీసీ రోడ్లు, ఇళ్లు, పంట పొలాలు, వాటర్ ట్యాంకులు, నీటి వనరులు, గ్రామపంచాయతీ పరిధిలోని ఇతర మౌలిక వసతులను మ్యాప్‌లో పొందుపరిచారు. గ్రామంలో ప్రస్తుతం ఉన్న వసతులను గుర్తించడంతో పాటు భవిష్యత్తులో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు ప్రణాళిక రూపొందించేందుకు ఈ మ్యాప్ ఉపయోగపడుతుందని అధికారులు తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మండల కేంద్రాల్లో గ్రామపంచాయతీల వారీగా ఈ ప్లానింగ్ ప్రక్రియ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఫణీచంద్ర, ఏపీఓ అనిత, ఎంపిఓ రంజిత్ కుమార్ గౌడ్, టెక్నికల్ అసిస్టెంట్లు రామన్న, గౌతమ్‌రాజ్, ప్రశాంత్, పంచాయతీ కార్యదర్శి రాజేందర్, ఫీల్డ్ అసిస్టెంట్ అరికిల్ల సుమన్ తదితరులు పాల్గొన్నారు.



# టీబీపై అప్రమత్తతే రక్షణ

- అనుమానితులకు తప్పనిసరిగా పరీక్షలు.
- డాక్టర్ ప్రదీప్‌రెడ్డి, డాక్టర్ సాయికృష్ణ.




**జనం వాయిస్, శాయంపేట, సెప్టెంబరు 29:**

టీబీ లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో పరీక్షలు చేయించుకోవాలని జిల్లా టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ ప్రదీప్‌రెడ్డి, మండల వైద్యాధికారి డాక్టర్ సాయికృష్ణ సూచించారు. టీబీ రహిత సమాజ నిర్మాణానికి ప్రజల భాగస్వామ్యం అవసరమన్నారు. మంగళవారం శాయంపేట, పత్తిపాక గ్రామపంచాయతీల్లో టీబీ ముక్త్ అభియాన్ ఫేజ్-2లో భాగంగా వైద్య శిబిరాలు చేపట్టారు. శాయంపేటలో 86 మంది, పత్తిపాకలో 84 మందికి ఎక్స్‌రే, తెమడ పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. టీబీ లక్షణాలు, నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. 14 ఏళ్లకు పైబడిన ధూమపానం, మద్యపానం అలవాటు ఉన్నవారు తప్పనిసరిగా టీబీ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కేవలం దగ్గు ఒక్కటే టీబీ లక్షణం కాదని డాక్టర్ ప్రదీప్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఫణిచంద్ర, శశి, ఎస్టీఎస్ శ్రీనివాస్, నోడల్ అధికారి చలపతిరావు, ల్యాబ్ టెక్నీషియన్లు, రేడియోగ్రాఫర్లు, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

# బిజెపి ఏజెంట్ ఈసి జ్ఞానేశ కుమార్ రాజీనామా చేయాలి

## నల్లు సుధాకర్ రెడ్డి సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు.

**కురవి, సెప్టెంబర్ 29 (జనం వాయిస్) :**

కేంద్ర బీజేపీ ప్రభుత్వ ఏజెంట్ లా వ్యవహరిస్తు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నల్లు సుధాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం కురవి మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన అధికారి జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ తో సిపిఐ శ్రేణులు నిరసన ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సంఘం లో మెజారిటీ సభ్యుల నిర్ణయాన్ని బేకాతర చేస్తూ ఏకపక్ష నిర్ణయాలతో సి ఈ సి జ్ఞానేష్ కుమార్ ప్రజాస్వామ్యాన్ని అప్రతిష్ట పాలు చేస్తూ, సర్ ప్రక్రియను ప్రతిపక్షాలను నిర్వీర్యం చేయడానికి ఉపయోగిస్తూ, లక్షలాది ఓట్లు గల్లంతు అయ్యే విధంగా రకరకాల కొర్రీలతో ప్రతిపక్ష పార్టీలు ఆయా రాష్ట్రాలలో అధికారం కోల్పోవడానికి కారణమై బిజెపికి తొత్తులా వ్యవహరిస్తు, కోట్లాదిమంది ప్రజలను అభద్రతా భావానికి, తీవ్ర ఆందోళనకు గురిచేసే సర్ ప్రక్రియను వెంటనే ఆపేసి, జ్ఞానేశ్ కుమార్ ను పదవి నుండి భర్త రఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కన్వీనర్ బుడమ వెంకన్న, సహాయ కార్యదర్శి బుర్ర సమ్మయ్య, కురవి టౌన్ కార్యదర్శి తురక రమేష్, దూదికట్ల సారయ్య,టి రమేష్ బాబు, కలగూర నాగరాజు, నిలుగొండ నాగేశ్వరావు, బొడ్డు ఉదయ్, సంగేశీ జన్ను, బొల్లం అనిల్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు




# ఉగ్గంపల్లి పీహెచ్‌సీలో ఆకస్మిక తనిఖీ

**మహబూబాబాద్, సెప్టెంబర్ 29 (జనం వాయిస్):**

జిల్లా లోని చిన్నగూడూరు మండలం ఉగ్గంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రాష్ట్ర ప్రజారోగ్య వైద్య సంచాలకులు డాక్టర్ రవీంద్ర నాయక్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రి హాజరు పట్టిక, ల్యాబొరేటరీ సేవలు, మందుల నిల్వలు, పంపిణీ వివరాలను పరిశీలించారు. గర్భిణీల నమోదు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల ప్రోత్సాహం, ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై సమీక్షించారు. మలేరియా, డెంగ్యూ వంటి సీజనల్ వ్యాధుల నియంత్రణ చర్యలను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను సాధించి రాష్ట్రస్థాయిలో ముందంజలో ఉండేలా కృషి చేయాలని డీఎంహెచ్ఓ డాక్టర్ బి. రవి రాథోడ్కు సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ రవి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



# పాత ఓటు ఉన్నా.. మళ్లీ దరఖాస్తు తప్పనిసరి

## నవంబరు 6లోగా ఫారం-18 సమర్పించాలి: ఎర్ర రాకేష్‌రెడ్డి

**జనం వాయిస్, శాయంపేట, సెప్టెంబరు 29:**



అర్హులైన పట్టభద్రులంతా ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలని మై భారత్ జిల్లా కన్వీనర్ ఎర్ర రాకేష్‌రెడ్డి కోరారు. నల్లగొండ--వరంగల్--ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఓటర్ల జాబితాను కొత్తగా రూపొందిస్తున్నందున గతంలో ఓటు ఉన్నవారు సైతం ఫారం-18 ద్వారా మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాత జాబితాలో పేరు ఉన్నంత మాత్రాన ఓటు కొనసాగదని స్పష్టం చేశారు. అర్హులైన పట్టభద్రులు నవంబరు 6లోగా దరఖాస్తు చేసుకుని ఓటు హక్కును నమోదు చేసుకోవాలని రాకేష్‌రెడ్డి సూచించారు.

# కొడుకు చేతిలో తండ్రి దారుణ హత్య

**సీరోలు, సెప్టెంబర్ 29 : (జనం వాయిస్):**



మహబూబాబాద్ జిల్లా కురవి ఉమ్మడి మండలం సుదనపల్లి గ్రామంలో మంగళవారం ఒక దారుణమైన ఘటన చోటుచేసుకుంది. కన్నతండ్రిని కొడుకే కర్రతో, ట్యూబ్‌లైట్ ఐరన్ ఫ్రేమ్‌తో కొట్టి చంపిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. సీరోలు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సుదనపల్లి గ్రామానికి చెందిన లకుమల్ల వెంకన్న అనే వ్యక్తి ప్రతిరోజూ మద్యం తాగి వచ్చి తన భార్యను తీవ్ర ఇబ్బందులకు గురిచేసేవాడు. భర్త వేధింపులు భరించలేక సదరు మహిళ తన కొడుకు లకుమల్ల సునీల్‌కు ఈ విషయాన్ని చెప్పి వాపోయింది. దీంతో తీవ్ర ఆగ్రహానికి లోనైన సునీల్, తల్లి ఇంట్లో లేని సమయం చూసి ఇంటికి వచ్చాడు. "అమ్మను ఎందుకు రోజు తాగి వచ్చి ఇబ్బంది పెడుతున్నావు?" అంటూ తండ్రితో గొడవకు దిగాడు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య ఘర్షణ తీవ్రం కావడంతో, ఆవేశం ఆపుకోలేని సునీల్ ఇంట్లో ఉన్న కర్రతో, ట్యూబ్‌లైట్ ఐరన్ ఫ్రేమ్‌తో తండ్రి వెంకన్నపై విచక్షణారహితంగా దాడి చేశాడు. తీవ్రమైన దెబ్బలు తగలడంతో వెంకన్న అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. ఘటన అనంతరం నిందితుడు సునీల్ అక్కడి నుంచి పరారయ్యాడు. సమాచారం అందుకున్న మరిపెడ సీఐ పవన్ కుమార్, సీరోలు ఎస్సై ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీరోలు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసుకున్నారు. నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టామని, కేసు దర్యాప్తులో ఉందని సీఐ పవన్ కుమార్ తెలిపారు.

# దేవరుప్పుల గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా తోటకూరి రమేష్ నియామకం

**సెప్టెంబర్ 29 జనం వాయిస్ పాలకుర్తి:**

దేవరుప్పుల గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా తోటకూరి రమేష్ పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి నియమించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి నూతనంగా నియమితులైన తోటకూరి రమేష్ శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ బలోపేతానికి, గ్రామస్థాయిలో కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ నియామకం పట్ల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ తోటకూరి రమేష్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవరుప్పుల మండల పార్టీ అధ్యక్షుడు అనిల్ కుమార్, ఎస్సీ సెల్ అధ్యక్షులు ఇనుముల నాగరాజు ఎస్టీ సెల్ అధ్యక్షులు భూక్య సజ్జన్ కిసాన్ సేల్ అధ్యక్షులు గోపు సుధాకర్ రెడ్డి, యూత్ అధ్యక్షుడు పులిగిల్ల వెంకన్న, రెడ్డి రాజుల రమేష్,మొటికె చంద్రశేఖర్, ఓడపెల్లి రవి, బానోత్ రామచంద్రు,కౌడగాని నర్సింగారావు,అనంతోజు రాజయ్య,చెన్నూరు రాంబాబు, గుగులోత్ నరేందర్ , బట్ట అంజయ్య,ఇనుముల బిక్షపతి, కారుపోతుల విజయ్ కుమార్, సోషల్ మీడియా కోఆర్డినేటర్లు గానుపాక ప్రదీప్, లోడంగి అశోక్, పులిగిల్ల అఖిల్ దేవ్ తదితరులు పాల్గొన్నారు.





# అక్టోబర్ 2న నల్ల నర్సింహులు శత జయంతి ఉత్సవాలు

**పాలకుర్తి సెప్టెంబర్ 29 జనం వాయిస్:**

జనగామ జిల్లా దొరలు భూస్వాముల పెత్తందారీ దోపిడీకి వ్యతిరేకంగా పేదలు రైతుల పక్షాన నిలిచి పోరాడిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట విప్లవ యోధుడు నల్ల నర్సింహులు శత జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.అక్టోబర్ 2వ తేదీన జనగామ జిల్లా కేంద్రంలోని బతుకమ్మ కుంట ఆవరణలో శత జయంతి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా సుందర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఏల సుందర్‌ను ఉత్సవాలకు హాజరై విజయవంతం చేయాలని కోరుతూ నిర్వాహకులు ఆహ్వానించారు.తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో నల్ల నర్సింహులు ప్రదర్శించిన తెగువ ధైర్యసాహసాలు ప్రజల హక్కుల కోసం చేసిన పోరాటం పేదలు రైతుల పక్షాన నిలిచిన పోరాట స్ఫూర్తిని ఈ సందర్భంగా స్మరించుకోనున్నారు.భూస్వామ్య పెత్తందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యపరిచి అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడిన నల్ల నర్సింహులు త్యాగాలు పోరాట స్ఫూర్తి నేటి తరానికి స్ఫూర్తిదాయకమని నిర్వాహకులు పేర్కొన్నారు.శత జయంతి ఉత్సవాలకు ప్రజలు యువత రైతులు అధిక సంఖ్యలో హాజరై నల్ల నర్సింహులు ఆశయాలను స్మరించుకోవాలని వారు పిలుపునిచ్చారు.ఆహ్వానం పలికిన వారు నల్ల నరసింహులు శతజయంతి ఉత్సవ కమిటీ వైస్ చైర్మన్ చింతకింది అరుణ మాచర్ల సారయ్య వైస్ చైర్మన్ పాలకుర్తి మండల పద్మశాలి సంఘం అధ్యక్షులు దేవసాని కృపాకర్ బమ్మెర మాజీ ఎంపిటిసి మాన్యపు భుజేందర్ కవి ఏల యాదగిరి నేత తదితరులు ఉన్నారు.



# సదరం క్యాంపా..? పైరవీల క్యాంపా..!

- అర్హులకు తక్కువ శాతం.. అనర్హులకు ఎక్కువ శాతం?.
- మహబూబాబాద్ జిల్లాలో ఇష్టారాజ్యంగా వైకల్య శాతాల నిర్ధారణ.
- నిజమైన దివ్యాంగులకు న్యాయం చేయాలి.. అనర్హులపై చర్యలు తీసుకోవాలి.
- మండల, గ్రామ స్థాయిలో ప్రత్యేక కమిటీలతో క్షేత్రస్థాయి విచారణకు డిమాండ్.
- 14 శాతం వైకల్యంతో పింఛన్‌కు దూరమైన ప్రమాద బాధితుడు.

**మహబూబాబాద్, సెప్టెంబర్ 29 (జనం వాయిస్) :**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 'సదరం' క్యాంపులు మహబూబాబాద్ జిల్లాలో లక్ష్యం తప్పి, అవినీతికి నిలయాలుగా మారుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిరుపేద, నిజమైన దివ్యాంగులకు అండగా నిలవాల్సిన ఈ ప్రత్యేక ప్రభుత్వ వైద్య శిబిరాలు, కొంతమంది అధికారులు, బ్రోకర్ల చేతుల్లో రూపాంతరం చెంది అర్హులకు తీరని అన్యాయం చేస్తున్నాయి. పారదర్శకంగా వైద్య పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్లు జారీ చేయాల్సిన డాక్టర్లు, పైరవీలకు తలొగ్గి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు జిల్లావ్యాప్తంగా కలకలం రేపుతున్నాయి. కొందరికి పైరవీలు, పలుకుబడుల ఆధారంగా అధిక శాతం.. నిజంగా వైకల్యంతో బాధపడుతున్న వారికి తక్కువ శాతం నమోదు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

### నిజమైన దివ్యాంగుడికి తక్కువ శాతం ఎందుకు?

వైకల్యం కారణంగా ఏ పని చేసుకోలేని పరిస్థితిలో ఉన్న కొందరికి తక్కువ శాతం నమోదు కావడంతో దివ్యాంగ పింఛన్‌తో పాటు వివిధ ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, రాయితీలకు వారు దూరమవుతున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు అనర్హులు అధిక శాతం సదరం సర్టిఫికెట్లు పొందుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### సర్టిఫికెట్ ఉంది.. వాస్తవంగా వైకల్యం ఉందా?

కొంతమంది సదరం సర్టిఫికెట్‌దారులు తమకు నమోదైన వైకల్యానికి విరుద్ధంగా సాధారణ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని, వాహనాలు నడుపుతున్నారని, శారీరకంగా పనులు చేసుకుంటున్నారని ప్రజల్లో చర్చ జరుగుతోంది.




అయితే ఇలాంటి ఆరోపణలు నిజమా? కాదా? అన్నది వైద్య రికార్డులు, సదరం పరీక్షా వివరాలు, క్షేత్రస్థాయి పరిశీలనతోనే తేల్చాల్సిన అవసరం ఉంది.

### జిల్లా వ్యాప్తంగా క్షేత్రస్థాయి విచారణ చేయాలి

సదరం సర్టిఫికెట్లలో నిజానిజాలు వెలుగులోకి రావాలంటే కేవలం కార్యాలయ రికార్డుల పరిశీలన సరిపోదని ప్రజలు అంటున్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి మండలంలో, గ్రామాల్లో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసి క్షేత్రస్థాయిలో విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నారు. సదరం సర్టిఫికెట్ పొందిన వ్యక్తుల వాస్తవ పరిస్థితి, వైకల్య స్వభావం, వైద్య రికార్డులు, వైకల్య శాతం తదితర అంశాలను పరిశీలిస్తే అర్హులు ఎవరు? అనర్హులు ఎవరు? అనే విషయం స్పష్టమయ్యే అవకాశం ఉందని పేర్కొంటున్నారు.

### క్షేత్రస్థాయి విచారణతోనే అసలు నిజం బయటపడే అవకాశం

మండల, గ్రామ స్థాయిలో ప్రత్యేక కమిటీలు ఇంటింటికీ లేదా సంబంధిత వ్యక్తుల వద్దకు వెళ్లి వాస్తవ పరిస్థితులను పరిశీలించి, అవసరమైన చోట వైద్య పునఃపరీక్షలు నిర్వహిస్తే సదరం సర్టిఫికెట్ల జారీలో జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని ప్రజలు చెబుతున్నారు. అలా చేస్తే నిజమైన దివ్యాంగులను గుర్తించి వారికి అర్హతకు అనుగుణంగా వైకల్య శాతం నిర్ధారించడంతో పాటు ప్రభుత్వ ప్రయోజనాలు అందేలా చేయవచ్చని అంటున్నారు.

### ప్రత్యేక ఆడిట్.. పునఃపరిశీలన అవసరం

గతంలో జారీ చేసిన అనుమానాస్పద సదరం సర్టిఫికెట్లపై ప్రత్యేక ఆడిట్ నిర్వహించాలని, అవసరమైన కేసుల్లో వైద్య పునఃపరీక్షలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా సర్టిఫికెట్ జారీ చేసినట్లు విచారణలో ఆధారాలతో తేలితే బాధ్యులపై చట్టపరమైన, శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే అనర్హులు అక్రమంగా ప్రభుత్వ ప్రయోజనాలు పొందినట్లు నిర్ధారణ అయితే నిబంధనల ప్రకారం వాటిని రికవరీ చేయాలని కోరుతున్నారు.

### "అర్హుడి హక్కును అనర్హుడికి ఇవ్వొద్దు"

సదరం సర్టిఫికెట్ అనేది నిజమైన దివ్యాంగుడికి ప్రభుత్వ సహాయం అందించేందుకు ఉపయోగపడే కీలకమైన ధ్రువీకరణ పత్రమని, దాని జారీలో ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా పూర్తి పారదర్శకత పాటించాలని ప్రజలు కోరుతున్నారు. ప్రభుత్వం స్పందించి జిల్లా వ్యాప్తంగా మండల, గ్రామ స్థాయిలో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసి క్షేత్రస్థాయి విచారణ జరిపినప్పుడే అసలు నిజాలు బయటపడే అవకాశం ఉందని, తద్వారా నిజమైన దివ్యాంగులకు న్యాయం జరుగుతుందని జిల్లా ప్రజలు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమగ్ర విచారణకు ఆదేశించి.. నిజమైన దివ్యాంగులకు న్యాయం చేయడంతో పాటు, విచారణలో అక్రమాలు నిర్ధారణ అయితే బాధ్యులపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

### 14 శాతం వైకల్యంతో పింఛన్‌కు దూరమైన ప్రమాద బాధితుడు

మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం బూరుగుపాడు శివారు దుబ్బతండాకు చెందిన అజ్మీర సక్రాం బైక్ ప్రమాదంలో కుడికాలుకు తీవ్ర గాయాలు కావడంతో శస్త్రచికిత్స చేసి రెండు వేళ్లు తొలగించినా, వైద్య ధ్రువీకరణలో 14 శాతం అంగవైకల్యంగా నమోదు కావడంతో వికలాంగుల పింఛన్‌కు అర్హత లేదని అధికారులు పేర్కొన్నారని దుబ్బతండాకు చెందిన అజ్మీర సక్రాం ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. నడవడానికే ఇబ్బందులు పడుతున్నానని, గతంలో మాదిరిగా పనులు చేసుకోలేక ఉపాధి కోల్పోయానని తెలిపాడు. తన పరిస్థితిని పునఃపరిశీలించి మరోసారి వైద్య పరీక్షలు నిర్వహించి న్యాయం చేయాలని జిల్లా అధికారులను కోరాడు.



# రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి

## ప్రమాద రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యం : జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

**మహబూబాబాద్, సెప్టెంబర్ 29 (జనం వాయిస్):**

జిల్లాలో రోడ్డు ప్రమాదాలను అరికట్టడానికి, ప్రయాణికుల భద్రతను మెరుగుపరచడానికి సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ తొ కలిసి కలెక్టరేట్ సమావేశ మందిరంలో పోలీస్, ఆర్‌అండ్‌బి, రవాణా, నేషనల్ హైవేస్, పంచాయతీ రాజ్, మున్సిపల్ శాఖల అధికారులతో "రోడ్డు భద్రత, ప్రమాదాల నివారణ"పై ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులు అందరూ బాధ్యతాయుతంగా పనిచేసి జిల్లాను రోడ్డు ప్రమాద రహితంగా తీర్చిదిద్దాలని అన్నారు. శాశ్వత నివారణ: జిల్లాలో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాలను తక్షణమే గుర్తించి రోడ్డు ఇంజనీరింగ్ లోపాలను సరిచేయాలి. డేంజర్ జోన్లు, మలుపుల వద్ద స్పష్టమైన హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు, రేడియంట్ స్టిక్కర్లు, కేట్ ఐస్ ఏర్పాటు చేయాలన్నారు. హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించకపోవడం, అతి వేగం, డ్రంక్ అండ్ డ్రైవ్‌లపై కఠిన తనిఖీలు చేపట్టాలి. మైనర్లు వాహనాలు నడిపితే తల్లిదండ్రులపై చట్టపరమైన చర్యలు తప్పవని, పరిమితికి మించి లోడ్ తో వెళ్లే వాహనాలపై భారీ జరిమానాలు విధించాలని అన్నారు. వర్షాల వల్ల రోడ్లపై ఏర్పడిన గోతులను, తక్షణమే పూడ్చివేయాలి. రాత్రి వేళల్లో రహదారులపై తగినంత వెలుతురు ఉండేలా వీధి దీపాల నిర్వహణను మెరుగుపరచాలి. ప్రధాన రహదారుల పక్కన అక్రమంగా పార్క్ చేసే వాహనాలపై ఆర్‌టీఓ, ట్రాఫిక్ పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. పాఠశాలలు, కళాశాలలు, బస్టాండ్లలో విద్యార్థులకు, ప్రజలకు రోడ్డు భద్రతా నిబంధనలపై అవగాహన సదస్సులు నిర్వహించాలి. ఆటో, క్యాబ్, లారీ డ్రైవర్లకు సురక్షిత ప్రయాణ నియమాలపై కౌన్సెలింగ్ ఇవ్వాలని, ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించేలా 108 అంబులెన్స్ సేవలను అనుసంధానించాలని, రహదారులకు సమీపంలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులను ఎల్లప్పుడూ అత్యవసర సేవల కోసం సిద్ధంగా ఉంచాలని వైద్యారోగ్య శాఖను ఆదేశించారు.

### ప్రతి నెలా రోడ్డు భద్రత పురోగతిపై సమీక్ష జరపాలి

జిల్లాలో ఎక్కువగా మరిపెడ, తొర్రూరు, గూడూర్, మండలలో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, మరిపెడ జాతీయ రహదారి నెంబర్ 365, 563, పై సమస్యలు గుర్తించమని కేవలం మరిపెడ లో (13) మంది చనిపోయారని, అలాగే కాంపెల్లి, కందికొండ, ఉప్పరి గూడెం, నల్లెల, తొర్రూరు పాలకేంద్రం జంక్షన్, టౌన్, గూడూరు మండల కేంద్రం, భూపతిపేట,



దామరవంచ, బొడ్డుగొండ, వద్ద హై టెంక్షన్ వైర్ల, సమస్యలు, మహబూబాబాద్ టౌన్, బెతోల్, తల్లపుసపల్లి, కురవి ఏకవలవ్య స్కూల్, బయ్యారం జాతీయ రహదారి 930 పి, పై సాయిబాబా, టెంపుల్, సత్యనారాయణపురం, కొత్తపేట, గంధంపల్లి, లలో సమస్యల పరిష్కారం కోసం వెంటనే ప్రత్యేక చర్యలు తీసుకోవాలని,భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా జాగ్రత్తగా ప్రయాణం చేసే విధంగా అవగాహన కల్పించే బాధ్యత సంబంధిత అధికారులు తీసుకోవాలని కోరారు. రహదారులపై సంతలు,( అంగడి) నిర్వహించకుండా చర్యలు తీసుకోవాలని, హైవే పై ప్రత్యేక వాహనాలు పెట్రోలింగ్ నిర్వహించాలని, అంబులెన్స్ లు అందుబాటులోకి ఉంచుకోవాలని సూచించారు. రహదారుల వెంబడి స్థలాలను ఆక్రమించకుండా చర్యలు తీసుకోవాలని, బిల్డింగ్ పర్మిషన్లను తనిఖీ చేయాలని, అన్ని విభాగాలకు సంబంధించి రోడ్డు భద్రత అంశాలపై ఎలాంటి నిధులు అవసరమున్న వెంటనే నివేదికలు తయారుచేసి వారం రోజులుగా పంపాలని కలెక్టర్ సంబంధిత అధికారులు ఆదేశించారు, రోడ్డు భద్రత తదితర అంశాలపై పిల్లలు ప్రజల్లో విస్తృత అవగాహన ప్రచారం కల్పించాలని తెలిపారు, అన్ని విభాగాల సంబంధిత అధికారులు జాయింట్ యాక్షన్ ప్లాన్ ప్రకారం నివేదికలు రెడీ చేసి తీసుకోవలసిన జాగ్రత్తలపై యాక్షన్ టేకెన్ రిపోర్టు ఇవ్వాలని, జాతీయ రహదారుల వెంబడి నిబంధనల మేరకు మద్యం దుకాణాలను అనుమతి ఇవ్వాలని అన్నారు, జిల్లాలో రోడ్డు ప్రమాదాలను అరికట్టడానికి పోలీసు శాఖ తరపున నిరంతర నిఘా మరియు కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. హెల్మెట్ లేకుండా ప్రయాణించే వారిపై, సీట్ బెల్ట్ ధరించని వారిపై, అతివేగం, మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై రాజీ లేని తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు. మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే వాహన యజమానులతో పాటు వారి తల్లిదండ్రులపై చట్టపరమైన కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పరిమితికి మించి లోడ్‌తో వెళ్లే లారీలు, ట్రాక్టర్లు ప్రమాదాలకు ప్రధాన కారణమవుతున్నాయని, అలాంటి వాహనాలపై భారీ జరిమానాలు విధించాలని అధికారులను ఆదేశించారు. రహదారుల పక్కన, జాతీయ రహదారులపై అక్రమంగా వాహనాలను నిలిపివేస్తే ట్రాఫిక్ పోలీసులు వెంటనే క్రేన్ల సహాయంతో తొలగించి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. డ్రైవర్లను సమూహాలుగా చేసి వారి ప్రవర్తనలో మార్పు వచ్చేలా, రోడ్డు నియమాలు పాటించేలా పోలీసు స్టేషన్ల వారీగా ప్రత్యేక కౌన్సెలింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి తమ విలువైన ప్రాణాలను కాపాడుకోవాలని, పోలీసు శాఖకు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ కె. అనిల్ కుమార్, ఇన్చార్జి అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు హౌసింగ్ పీడీ పురుషోత్తం, ఆర్ అండ్ బి ఈఈ రాజు, డీఎస్పీ తిరుపతి రావు, డిఆర్ఓ నాగలక్ష్మి,ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నితీష్, నేషనల్ హైవే పిడి,పిఆర్, ఆర్ అండ్ బి, ఈ ఈ లు, డిస్ట్రిక్ట్ ట్రాన్స్పోర్ట్ ఆఫీసర్, డివిహెచ్ఓ డాక్టర్ కిరణ్ కుమార్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవి రాథోడ్, ఏరియా ఆసుపత్రి సూపర్డెంట్ డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ రమేష్, ఎస్సీ ఎస్టీ, మైనార్టీ, సంక్షేమ శాఖ అధికారులు, ఆర్సిఓ లు, ఇంటర్ మీడియట్ అధికారి మదర్, ఎక్సైజ్, పోలీస్, అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, డిపిఓ రేవంత్, సంబంధిత అన్ని విభాగాల అధికారులు, కలెక్టరేట్ పర్యవేక్షకులు రాజేష్, తదితరులు పాల్గొన్నారు.